దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!

సంపుటి: 3 | సంచిక : 250 | శుక్రవారం 18. 9. 2026 | ఎడిటర్ వేముల అయోధ్య రాములు | పేజీలు 4 | వెల: 5.00

## నిజాంను కీర్తించడం కాంగ్రెస్, బీఆర్ఎస్ కపట నాటకం: ఎన్.రాంచందర్ రావు

నిజాం నిరంకుశ పాలనను, రజాకార్ల అకృత్యాలను కీర్తిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న రాజకీయాలు సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చొరవ, ఆపరేషన్ పోలో వల్లే హైదరాబాద్‌కు విముక్తి లభించిందని గుర్తుచేశారు. విమోచన దినోత్సవం సందర్భంగా పటేల్ విగ్రహం వద్ద రాంచందర్ రావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17ను అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని బీజేపీ దశాబ్దాలుగా పోరాడిందని గుర్తుచేశారు. ఓటు బ్యాంకు రాజకీయాలు, ఎంఐఎం ఒత్తిడి కారణంగా గత ప్రభుత్వాలు ఈ చారిత్రక దినాన్ని విస్మరించాయని, కానీ అమరుల త్యాగాలను గౌరవిస్తూ నరేంద్రమోడీ సర్కార్ 2022 నుంచి అధికారికంగా ఈ వేడుకలను నిర్వహిస్తోందని తెలిపారు.అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గతంలో కేసీఆర్.. నిజాం పాలనను కీర్తించడాన్ని తప్పుబట్టారు. నిజాంను పొగిడే ముందు ఆనాటి భీభత్సకాండను ఆ పార్టీలు గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. అమాయకులను పొట్టనబెట్టుకున్న పరకాల ఊచకోతను, బైరాన్‌పల్లి నరమేధాన్ని, నిజాం-రజాకార్ల కాలంలో మహిళలపై జరిగిన అకృత్యాలను ఎలా మరిచిపోయారని నిలదీశారు.

# అన్యాయాన్ని ఎదిరించడం తెలంగాణ గడ్డ స్వభావం

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- తరతరాల అణచివేత, దోపిడీ, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం
- రాష్ట్ర ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు నివాళి
- నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో ప్రజాపాలన దినోత్సవం
- "నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు తెలంగాణ పుట్టినిల్లు.
- అస్థిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల చైతన్యాన్ని రగిల్చింది.
- సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం.
- సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానముంది.
- నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది.
- అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణచివేతలు..
- చివరి దశలో రజాకారుల దౌర్జన్యాలు ప్రజలను కల్లోల పరిచాయి.
- భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడింది.
- రజాకారుల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం కమ్యూనిస్టులు పోరాడారు.
- హైదరాబాద్ ప్రజల ఆకాంక్ష మేరకు నెహ్రూ, పటేల్ నాయకత్వంలో సైనిక చర్య చేపట్టారు.
- ఆపరేషన్ పోలో అనంతరం ఏడో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారు.
- 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ అధికారికంగా భారత్‌లో అంతర్భాగమైంది.
- రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భమది.
- ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజాపాలన కొసాగిస్తున్నాం.
- తెలంగాణ పొరుగు రాష్ట్రాలతోనే కాదు.. ప్రపంచంతో పోటీ పడుతోంది.



**తొలి సమయం హైదరాబాద్**
తరతరాల అణచివేత, దోపిడీ, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు తెలంగాణ పుట్టినిల్లు. అస్థిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల చైతన్యాన్ని రగిల్చింది. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం. సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానముంది. నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణచివేతలు.. చివరి దశలో రజాకారుల దౌర్జన్యాలు ప్రజలను కల్లోల పరిచాయి. భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడింది. రజాకారుల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం కమ్యూనిస్టులు పోరాడారు. హైదరాబాద్ ప్రజల ఆకాంక్ష మేరకు నెహ్రూ, పటేల్ నాయకత్వంలో సైనిక చర్య చేపట్టారు. ఆపరేషన్ పోలో అనంతరం ఏడో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ అధికారికంగా భారత్‌లో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భమది. ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజాపాలన కొసాగిస్తున్నాం. తెలంగాణ పొరుగు రాష్ట్రాలతోనే కాదు.. ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18లక్షలు. దేశ తలసరి ఆదాయం కంటే ఇది 91 శాతం అధికం. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నాం. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టాం." అని రేవంత్ వివరించారు.

# మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తి: ఉపరాష్ట్రపతి




- భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగం కావడానికి ఎంతోమంది మహనీయుల బలిదానం
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవం
- హైదరాబాద్ విముక్తి కోసం పోరాడిన యోధులకు నివాళి
- మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తం
- హైదరాబాద్-జోధ్‌పూర్‌కు మధ్య విడదీయరాని బంధముందంఃకేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్
- ఇక్కడ నిజాం కు వ్యతిరేకంగా అనేకమంది యోధులు పోరాటం చేశారు
- స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కోసం ఎంతో పోరాటం చేసి తెలంగాణను భారత్‌లో కలిపేందుకు కృషి
- అప్పట్లో నిజాంకు వ్యతిరేకంగా ఎంతోమంది వీరులు పోరాటం చేశారు
- సీఎం రేవంత్ రెడ్డి నిజాంను పొగడటం సిగ్గుచేటు : కిషన్‌రెడ్డి
- నిజాంలు అంత మంచివారైతే చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, రావి నారాయణరెడ్డి వారిపై ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి
- నిజాం పాలన పోయినా నిజాం వారసత్వమైన మజ్లీస్ పార్టీ ఇంకా అరాచకాలు సృష్టిస్తోంది

**తొలి సమయం హైదరాబాద్**
భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగం కావడానికి ఎంతోమంది మహనీయుల బలిదానం కారణమని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తొలుత పోలీసు అమరవీరుల స్మృతి స్థూపం వద్ద ఉపరాష్ట్రపతి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. ఆ తర్వాత సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ హైదరాబాద్ విముక్తి కోసం పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్రమంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు సాయుధ బలగాల నుంచి ఉప రాష్ట్రపతి గౌరవవందనం స్వీకరించారు. విమోచన దినోత్సవం సందర్భంగా తెలంగాణ కళారూపాలు, వేయిస్తంభాల గుడి, బతుకమ్మ శకటాలను ప్రదర్శించారు. హైదరాబాద్-జోధ్‌పూర్‌కు మధ్య విడదీయరాని బంధముందని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తాను జోధ్‌పూర్ ప్రతినిధిగా ఇక్కడికి వచ్చానన్నారు. ఇక్కడ నిజాం కు వ్యతిరేకంగా అనేకమంది యోధులు పోరాటం చేశారన్నారు.

## పోలీసు ఉద్యోగాలకు రాత పరీక్ష తేదీలు విడుదల

**తొలి సమయం హైదరాబాద్**




పోలీసు ఉద్యోగాలకు రాత పరీక్ష తేదీలను తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) విడుదల చేసింది. ఎస్ఐ అభ్యర్థులకు నవంబర్ 29న, కానిస్టేబుల్ పోస్టులకు డిసెంబర్ 20న రాత పరీక్ష నిర్వహించనున్నట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. హోంశాఖ పరిధిలోని పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో 7,437 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. పోలీసు ఉద్యోగాలకు రాష్ట్ర వ్యాప్తంగా 5,77,064 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్ వి.వి శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో ఎస్ఐ పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్ పోస్టులకు 3,89,356 మంది దరఖాస్తు చేసుకున్నట్టు వివరించారు.

## దర్యాప్తు అధికారం ఏసీబీకి లేదు

**ఓటుకు నోటు కేసు.. రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ**

పిటిషన్లపై విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం

నాటి నిబంధనల ప్రకారం ఈ అంశాన్ని ఎన్నికల ప్రక్రియగానే చూడాలని వాదన



## సంస్కరణల దిశగా అడుగులు

**దేశ పన్ను వ్యవస్థ మరింత బలోపేతం**

**కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్**



**తొలి సమయం హైదరాబాద్** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సంస్కరణలను తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకుని రావాల్సిన అవసరం ఉందని అన్నారు. పన్ను నిబంధనలలో మార్పుల కోసం వ్యక్తిగత ప్రయోజనాల ఆధారంగా కాకుండా వ్యవస్థకు మిగతా 2లో..




## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటరు జాబితా షెడ్యూల్ విడుదల

**తొలి సమయం హైదరాబాద్**
తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా షెడ్యూల్ విడుదలైంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాను ఈసీ విడుదల చేసింది. పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఈ నెల 20న ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుంది. నవంబరు 6 వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించనుంది. నవంబరు 25న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనుంది. నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు స్వీకరించనుంది. డిసెంబరు 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు.

గతంలో ఓటున్న వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) తెలిపారు. మార్చిలో ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవీ కాలం ముగియనుంది.

## కేసీఆర్‌కు వందల ఎకరాలుంటే అఫిడవిట్‌లో తప్పులు రాశారా?

- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు అప్పులే మిగిలాయి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఉద్యమకారులకు ఆస్తులు తగ్గితే.. కేసీఆర్‌కు రూ.లక్షల కోట్లు వచ్చాయి
- ."2004 వరకు కేసీఆర్‌కు ఒక్క ఎకరా భూమి కూడా లేదు.
- ఎకరా భూమి కూడా లేదని ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.
- కేసీఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు ఉన్నాయి.
- ఎన్నికల అఫిడవిట్ ద్వారా కల్వకుంట్ల ముఠా అడ్డంగా దొరికింది.
- పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు.

బీఆర్ఎస పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు అప్పులే మిగిలాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉద్యమకారులకు ఆస్తులు తగ్గితే.. కేసీఆర్‌కు రూ.లక్షల కోట్లు వచ్చాయని ఆరోపించారు. సీఎం రేవంత్, ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శల నేపథ్యంలో పొంగులేటి స్పందించారు. "2004 వరకు కేసీఆర్‌కు ఒక్క ఎకరా భూమి కూడా లేదు. ఎకరా భూమి కూడా లేదని ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కేసీఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్ ద్వారా కల్వకుంట్ల ముఠా అడ్డంగా దొరికింది. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు. అలాంటప్పుడు అఫిడవిట్‌లో తప్పులు రాశారా?లేకుంటే ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా?ఉద్యమకారుల త్యాగాల పునాదులపై రూ.లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారు" అని పొంగులేటి ప్రశ్నించారు.


## మా కుటుంబ ఆస్తులు.. రేవంత్ ఆస్తులపై విచారణకు సిద్ధమా?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- కేసీఆర్‌కు 67 ఎకరాలు మాత్రమే ఉందని అసెంబ్లీ సాక్షిగా సీఎం అంగీకరించారు
- "ఇన్ని రోజులు విష ప్రచారం చేసినందుకు కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి.
- కేసీఆర్ పుట్టినప్పటి నుంచి మా కుటుంబ ఆస్తులెన్నో విచారణకు మేం సిద్ధం.
- రేవంత్ పుట్టినప్పుడు ఆయన ఆస్తులెన్ని.. ఇప్పుడు ఎన్నో విచారణకు సిద్ధమా?
- కేసీఆర్‌కు వ్యవసాయం అంటే మక్కువ. సీఎంగా ఉన్నా వ్యవసాయం చేశారు.
- రేవంత్‌లా భూమిని ఆయన ఆట వస్తువుగా చూడలేదు.
- కేసీఆర్ తండ్రికి వందల ఎకరాలు ఉండేవి. అప్పట్లోనే కేసీఆర్ ఇల్లు రెండెకరాల్లో ఉండేది.
- చింతమడకలోని ఆ ఇంటిని కూడా ప్రభుత్వ స్కూల్‌కి ఇచ్చారు.
- ఎన్ని ఆరోపణలు చేసినా 22ఏ బాధితుల పక్షానే నిలబడతాం.
- ప్రభుత్వం చేసిన తప్పులను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటాం"




**తొలి సమయం హైదరాబాద్**
మాజీ సీఎం కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ సీఎం రేవంత్‌రెడ్డి విష ప్రచారం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌కు 67 ఎకరాలు మాత్రమే ఉందని అసెంబ్లీ సాక్షిగా సీఎం అంగీకరించారని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "ఇన్ని రోజులు విష ప్రచారం చేసినందుకు కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ పుట్టినప్పటి నుంచి మా కుటుంబ ఆస్తులెన్నో విచారణకు మేం సిద్ధం. రేవంత్ పుట్టినప్పుడు ఆయన ఆస్తులెన్ని.. ఇప్పుడు ఎన్నో విచారణకు సిద్ధమా? కేసీఆర్‌కు వ్యవసాయం అంటే మక్కువ. సీఎంగా ఉన్నా వ్యవ సాయం చేశారు. రేవంత్‌లా భూమిని ఆయన ఆట వస్తువుగా చూడలేదు. చట్టప్రకారం కేసీఆర్ కొనుగోలు చేసిన భూములపై సీఎం బురద చల్లుతున్నారు. కేటీఆర్ అన్నారు.

## ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ ఆయుధ ప్యాకేజీ



- రూ.26వేల కోట్ల విలువైన ఆయుధాలు సరఫరా!
- 40వేల అత్యంత శక్తిమంతమైన భారీ బాంబులు
- ఇజ్రాయెల్‌తో అమెరికా రహస్య సమావేశం!
- ఏడు అరబ్ దేశాల సైనికాధికారులతో భేటీ

తొలి సమయం
దిన పత్రిక
వాస్తవమే గమ్యం! గమనం!!



## దాట్లలో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం -- ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

**జెండా ఆవిష్కరణలో గ్రామ సర్పంచ్...కొమ్మినేని మంజుల రవీందర్**





**తొలి సమయం - దంతాలపల్లి, సెప్టెంబర్ 17**
తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల గ్రామంలో బుధవారం జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం దేశభక్తి భావంతో ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 9 గంటలకు గ్రామ సర్పంచ్ కొమ్మినేని మంజుల రవీందర్ మహబూబాబాద్ జిల్లా సీనియర్ నాయకులు కొమ్మినేని రవీందర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ గీతాలాపన చేసి, అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల రవీందర్ మాట్లాడుతూ...1948 సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన నుండి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొంది భారతావనిలో విలీనమైన చారిత్రక ఘట్టం తెలంగాణ విమోచన దినోత్సవం. సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో జరిగిన ఆపరేషన్ పోలో ఫలితంగా మనకు స్వేచ్ఛ లభించింది. ఆనాటి విమోచన పోరాటంలో ప్రాణాలు అర్పించిన కొమురం భీం, స్వామి రామానంద తీర్థ, ఆరుట్ల రామచంద్రారెడ్డి లాంటి ఎందరో మహనీయుల త్యాగాలను ఈ తరం యువత ఎప్పటికీ మరువకూడదు అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న అభివృద్ధిని కాపాడుకుంటూ, గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే నిజమైన అమరవీరులకు నివాళి అని ఆమె అన్నారు. అదేవిధంగా దాట్ల గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, అంగన్ వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విమోచన దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

## దుబ్బ తండా, మేఘ్యా తండా, రేఖ్యా తండాలో కేసీఆర్, మాజీ మంత్రి-గిరిజన నేత రెడ్యా నాయక్ చిత్రపటానికి పాలాభిషేకం

**ఎస్టీలకు 10% రిజర్వేషన్ ప్రకటించినందుకు కృతజ్ఞతగా వేడుకలు**



**తొలి సమయం - దంతాలపల్లి సెప్టెంబర్ 17**
తెలంగాణలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ ప్రకటించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ కి కృతజ్ఞతగా మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దుబ్బ తండా, మేఘ్యా తండా, రేఖ్యా తండా గ్రామలలో గిరిజన బిడ్డలు పాలాభిషేకం నిర్వహించారు. 2022 సెప్టెంబర్ 17న ఎస్టీ రిజర్వేషన్ ను 6% నుండి 10% కి పెంచుతూ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆ నిర్ణయాన్ని గుర్తు చేసుకుంటూ గిరిజన సంఘాలు ఈరోజు కేసీఆర్ చిత్రపటానికి, మాజీ మంత్రివర్యులు, గిరిజన నేత రెడ్యా నాయక్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం మాజీ సర్పంచ్ వినోద శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజనుల అభివృద్ధి కోసం కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. ముఖ్యంగా 10 శాతం రిజర్వేషన్ ఇవ్వడం వల్ల విద్య, ఉద్యోగాల్లో గిరిజన బిడ్డలకు ఎంతో మేలు జరిగింది. ఆ రుణం తీర్చుకోవడానికి ఈ పాలాభిషేకం నిర్వహిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మూడు తండాలకు చెందిన గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి జై, మాజీ మంత్రి రెడ్యా నాయక్ జై అంటూ నినాదాలు చేశారు.

## దేవశిల్పి విశ్వకర్మ భగవాన్ జయంతిని ఘనంగా జరుపుకున్న విశ్వబ్రాహ్మణ సంఘం



**తొలి సమయం - దంతాలపల్లి, సెప్టెంబర్ 17;**
సృష్టికర్త, దేవశిల్పి అయిన విశ్వకర్మ భగవాన్ జయంతిని పురస్కరించుకుని దంతాలపల్లి మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశ్వకర్మ భగవాన్ చరిత్ర, ఆయన చేసిన సృష్టి కార్యాల గురించి పెద్దలు వివరించారు. విశ్వబ్రాహ్మణులు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని, కుల బాంధవులందరూ ఐక్యంగా ఉండాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు అసనాబాద చంద్రమౌళి, కొత్తపల్లి శ్రీనివాస్, గుగ్గిళ్ళ లక్ష్మీనారాయణ, అక్కెన యుగంధర్, పబ్బోజు సుధాకరాచారి, బాణాల పుల్లాచారి, బాణాలు బిక్షపతి, గజ్జల వెంకన్న, తాడూరి సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించండి

- చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాద శక్తులు
- సిపిఎం పార్టీ తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ.
- సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బొల్లం అశోక్, ఎండి యాకూబ్.





**తొలి సమయం - తొర్రూరు సెప్టెంబర్ 17.**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటా చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాద శక్తుల వ్యతిరేకంగా పోరాడాలి అని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బొల్లం అశోక్, ఎండి యాకూబ్ లు అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ముగింపు సందర్భంగా తొర్రూరు మండలంలో మండల కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో అన్ని గ్రామాల్లో అమరవీరుల స్థూపాల దగ్గర పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, మండల కార్యదర్శి ఎండి యాకూబ్ లు మాట్లాడుతూ, తెలంగాణ ప్రాంతంలో నాడుభూమి కోసం, భుక్తి కోసం, వేట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహత్తర పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని వారు కొనియాడారు, ఆ పోరాటంలో 4వేల మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఆ పోరాటానిదని వారు అన్నారు. 4 వేల గ్రామాలలో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో గ్రామ స్వరాజ్యాలు ఏర్పడ్డాయని ప్రజలు అన్ని హక్కులతో స్వేచ్ఛగా జీవించారని వారు గుర్తు చేశారు. ఇంతటి మహత్తర పోరాటం ప్రపంచ చరిత్రలో పుటల్లో లికించబడిందని, ఇలాంటి పోరాటాన్ని ఇప్పుడున్న పాలకులు కుల మతాల మధ్య జరిగిన పోరాటంగా వక్రీకరిస్తున్నారు. కుల మతాల మధ్య జరిగిన పోరాటం కాదని విముక్తి పోరాటమని వారు అన్నారు. ఆ పోరాటాన్ని ఇప్పుడున్న పాలకులు మతోన్మాద శక్తులు చరిత్రను వక్రీకరిస్తున్నాయని, చరిత్రను వక్రీకరిస్తే చరిత్ర మారదని ప్రజలందరూ నాడు జరిగినటువంటి మహత్తర పోరాటం కమ్యూనిస్టుల త్యాగాల గురించి తెలుసుకోవాలని గ్రామ గ్రామాన సభలు సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తొర్రూర్ లో పూసల వెంకటయ్య స్తూపం దగ్గర పూలమాలవేసి నివాళులర్పించి సభ నిర్వహించడం జరిగింది. హరిపిరాల గ్రామంలో స్వతంత్ర సమరయోధుడు వల్లపు కొమురెల్లి, గోపాలగిరిలో ఉద్యమ నాయకులు యనమాల వెంకటయ్య, కంటాయపాలెం గ్రామంలో బండి స్వామి వేదాచారి, మార్క్సాపురం నరసయ్య,గుర్తూర్ లో పెరుమాండ్ల జగన్నాథం , అమ్మాపురం గ్రామంలో తమ్మెర వెంకట రామ నరసయ్య, ముద్దం శ్రీనివాస్ రెడ్డి స్తూపాలకు పూలమాలలేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హరిపిరాల మాజీ సర్పంచ్ వల్లపు మల్లయ్య, శ్రీను, సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు జన్నపరెడ్డి సోమిరెడ్డి, మార్క సాంబయ్య, జమ్ముల శ్రీను, డొనక దర్గయ్య, సాయి మల్లు, కంటాయపాలెం గ్రామ ఉపసర్పంచ్ జితేందర్ రెడ్డి, ధరావత్ యాకన్న, వెంకట్ రెడ్డి, మట్టపల్లి కుమార్, తిమ్మిడి రవి,భాష గాని ప్రభాకర్ స్వరూప , కోటగిరి సంతోష్ ,రాము, క్రాంతి కుమార్, అనిల్, శోభన్ , కుమార్, షమీన భాగ్య , శైలజ,మంజుల సౌజన్య రాధా, యాకమ్మ, తదితరులు పాల్గొన్నారు

## తొర్రూరు పెద్ద చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లు ముమ్మరం - భక్తుల భద్రతే లక్ష్యంగా తనిఖీలు

**భక్తుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత...మున్సిపల్ చైర్మన్ తునం శ్రావణ్.**





**తొలి సమయం - తొర్రూరు, సెప్టెంబర్ 17;**
మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని పెద్ద చెరువు వద్ద వినాయక నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ తునం శ్రావణ్ కుమార్ బృందం సోమవారం పరిశీలించింది. ఈ పరిశీలనలో వైస్ చైర్మన్ సోమ రజినీరాజశేఖర్, సీఐ గణేష్, ఎస్సై మహేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్, కౌన్సిలర్లు సురేష్, జంపా, భవానీ, పద్మ, జయమ్మ, ఉప్పలయ్య, గజ ఈతగాళ్లు పాల్గొన్నారు. వినాయక నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, లైటింగ్, ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ తునం శ్రావణ్ మాట్లాడుతూ... ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి భక్తుడు సురక్షితంగా, ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేలా పోలీస్ శాఖ, మున్సిపల్ యంత్రాంగం మరియు గజ ఈతగాళ్ల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. తొర్రూరు ప్రజలకు స్పష్టమైన భరోసా ఇస్తూ... మీ భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల పండుగలు ప్రశాంతంగా జరిగేలా చూడటం ప్రజాప్రతినిధిగా తమ బాధ్యత అని, ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు.

## కమ్యూనిస్టుల తెలంగాణ విముక్తి చరిత్రను మార్చలేరు: సిపిఐ




**తొలి సమయం, వనపర్తి, సెప్టెంబర్ 17**
నిజాం పీడన నుంచి తెలంగాణ విముక్తికి కమ్యూనిస్టులు సాగించిన సాయుధ పోరాట చరిత్రను ఎవరు మార్చలేరని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, అన్నారు. వనపర్తి అంబేద్కర్ చౌక్ లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పోరాట యోధులు కామ్రేడ్ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మొయినుద్దీన్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సోయబుల్లాఖాన్ తదితరుల చిత్రపటాలకు సిపిఐ మాజీ సర్పంచ్ కళావతమ్మ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి ప్రజల విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందన్నారు. ప్రజలను పీడిస్తున్న నిజాం రజాకర్లను భూస్వాములు దొరలను గ్రామాల నుంచి తరిమికొట్టి మూడువేల గ్రామాలను విముక్తం చేసిందని, భూమిలేని పేదలకు 10 లక్షల ఎకరాల భూములను పంచిందని ఈ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టు యోధులు అమరులైనారన్నారు. కమ్యూనిస్టుల పోరాటంతోనే నిజాం దిగివచ్చి హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేశారన్నారు. కమ్యూనిస్టుల ఇంతటి మహత్తర త్యాగాలను పోరాటాలను కనుమరుగు చేసేందుకు బిజెపి వంటి మతతత్వ శక్తులు దీన్ని హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నాయని తిప్పి కొట్టాలన్నారు. ఇండియాలో హైదరాబాద్ విలీనమైన నేపథ్యంలో ప్రభుత్వం విలీన దినాన్ని అధికారికంగా జరపాలని, నాటి పోరాట చరిత్రను విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో చేర్చి స్ఫూర్తి కలిగించాలన్నారు. అమరుల పోరాట స్ఫూర్తితో దేశంలో రాష్ట్రంలో శ్రమజీవుల అభివృద్ధి సంక్షేమం కోసం సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్, గోపాలకృష్ణ, నేతలు పృధ్వీనాదం,చిన్న కురుమన్న, శేఖర్, మహేష్, వంశీ, శిరీష, జ్యోతి, శ్రీదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

**తెలంగాణ, ఇల్లందు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన హరిప్రియ నాయక్, దిండిగాల రాజేందర్.**





**తొలి సమయం, ఇల్లందు; సెప్టెంబర్, 17:**
ఇల్లందు, జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి బానోత్ హరిప్రియ నాయక్, బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో గురువారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత జేకే కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా, గులాబీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జగదాంబ సెంటర్లోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద జాతీయ జెండా, గులాబీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిప్రియ నాయక్, దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 దేశ సమైక్యత, సమగ్రతకు ప్రత్యేకంగా నిలిచిన చారిత్రాత్మక రోజని అన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసుకున్నారు. నిజాం, రజాకార్ల పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు, రైతాంగం సాగించిన పోరాటాలను స్మరించుకున్నారు. ప్రజల ఐక్యత, సమైక్యతా స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇల్లందు పట్టణ, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**రొంపేడులో బీఆర్ఎస్ నాయకులు, ప్రజల కృతజ్ఞత కార్యక్రమం**




**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 17:**
ఇల్లందు, బీఆర్ఎస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు రొంపేడు గ్రామపంచాయతీలో గురువారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అజ్మీరా బావ్‌సింగ్ నాయక్, వార్డు మెంబర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బానోత్ జోగ్య, అజ్మీరా పద్మ, మూడ్ బలరాం, గూగులోత్ సోమన్న, భూక్యా రాంజీ, గలిగ కృష్ణ, పాయం నర్సింగరావు, బదావత్ హరిలాల్, అజ్మీరా రవి, బానోత్ శంకర్, బానోత్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## బొజ్జాయిగూడెంలో జాతీయ సమైక్యత దినోత్సవం.

**కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీఆర్ఎస్ నాయకులు.**



**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 17:**
ఇల్లందు: బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని బొజ్జాయిగూడెం గ్రామంలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బానోత్ హరిప్రియ నాయక్, బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను ఆరు శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని వారు ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ విషయాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు దల్‌సింగ్, బొజ్జాయిగూడెం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గంట నారాయణ, ఉపాధ్యక్షులు గడ్డం వెంకన్న, వజ్జా జ్యోతి, బొర్రా సుభాష్, ఈసం హరీష్, చీమల విష్ణు, సిరిముల్లా సురేష్, శివరాత్రి సురేష్, ఇరుప వెంకట్, ఇర్పా వెంకట్, తాటి పాండు, చీమల నాగేంద్రబాబు, కల్తి సాయి, గడ్డం సాయి, చీమల అంజమ్మ, వరుస అనసూయ, మండల నాయకులు ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన కేసీఆర్: బీఆర్ఎస్ నాయకులు

**కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం.**



**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 17:**
ఇల్లందు: గిరిజనుల దశాబ్దాల ఆకాంక్షలను గుర్తించి ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్, మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్ ఆదేశాల మేరకు గురువారం జగదాంబ గుంపుతో పాటు పలు ప్రాంతాల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. గిరిజనులకు స్వయంపాలన, రాజకీయ ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం కల్పించేందుకు ఆయన ప్రభుత్వం కృషి చేసిందని పేర్కొన్నారు. గిరిజన విద్యకు ప్రాధాన్యతనిస్తూ గురుకులాల విస్తరణ చేపట్టడంతో పాటు గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారని తెలిపారు.కేసీఆర్ సేవలను గుర్తు చేసుకుంటూ తండాలు, గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సుదిమల్ల గ్రామపంచాయతీ సర్పంచ్ కుంజా సుకనయ్య, బీఆర్ఎస్ మండల నాయకులు ఇర్పా కాంతారావు, ఒకటో వార్డు సభ్యుడు స్వర్ణపాక రమేష్, నాలుగో వార్డు సభ్యురాలు భద్రమ్మ, ఐదో వార్డు సభ్యురాలు కోరంవాణి, ఆరో వార్డు సభ్యురాలు కోరం సుజాత ,ఏడో వార్డు సభ్యుడు ఇర్పాశంకర్ ,తొమ్మిదో వార్డు సభ్యురాలు సుజాత, జగదాంబ గుంపు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్లో పోషణ మాసం కార్యక్రమము

**సందర్శించిన సర్పంచ్ ఈదురు బుచ్చమ్మ**



**తొలి సమయం పెద్ద వంగర సెప్టెంబర్ 17**
చిట్యాల గ్రామంలో ఈరోజు ఏర్పాటు చేసిన పోషకాహార లోపం నివారణ పిల్లలు, గర్భిణులు మరియు బాలింతలలో పోషకాహార లోపాన్ని, రక్తహీనతను తగ్గించడం. అవగాహన కార్యక్రమాలు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడం.ప్రత్యేక వేడుకలు: చిన్నారులకు అన్నప్రాశనలు, గర్భిణులకు సీమంతం వేడుకలు నిర్వహించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ర్యాలీలు చేపట్టి ప్రచారం చేయడం. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభా రాణి , గ్రామ సర్పంచ్ ఈదురు బుచ్చమ్మ ఉప సర్పంచ్ మహాలక్ష్మి గ్రామ కార్యదర్శి అంగన్వాడీ టీచర్స్ ఆశా వర్కర్స్ గ్రామంలోని గర్భిణీలు బాలింతలు చిన్నపిల్లల తల్లులు కిశోర బాలికను పాల్గొనడం జరిగినది

# యానంబైలు పాఠశాలలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**తొలి సమయం, పాల్వంచ; సెప్టెంబర్, 17:**
పాల్వంచ రూరల్, పాల్వంచ గ్రామీణ ప్రాంతంలోని యానంబైలు పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ప్రకాశ్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల సిబ్బంది తరఫున రమణ సార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ప్రాముఖ్యత, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు, ప్రజల ఆకాంక్షలను వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో



ప్రజల భాగస్వామ్యం, పౌరుల బాధ్యతలు, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలతోపాటు రాష్ట్ర అభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్రను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, సమాజం, రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు .కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ప్రతిజ్ఞ చేశారు. దేశభక్తి, తెలంగాణ స్ఫూర్తిని ప్రతిబింబించేలా కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. వేడుకలను విజయవంతంగా నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని పలువురు అభినందించారు.

# సుదిమల్లలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, 17:**
సుదిమల్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ కుంజా







సుకనయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని గుర్తు చేశారు. నిజాం, రజాకార్ల పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు, రైతాంగం చేసిన పోరాటాలను వివరించారు.అనంతరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి హనుమంతుల పహాడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హి సేవ






కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.డి. అజహార్, పాలకవర్గ సభ్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన గంట సంజీవరెడ్డి

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 17:**
కేసముద్రం మండలం కలవల మోడల్ స్కూల్ , కళాశాల ప్రిన్సిపల్ పరిమి నవీన్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంటా చేతుల మీదుగా షూ టై, ఐడి కార్డ్స్, బ్యాగ్స్, యూనిఫామ్ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం చైర్మన్ గంటా మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చక్కటి యూనిఫాంలో పాఠశాలకు రావాలని ముఖ్యమంత్రి ప్రతి విద్యార్థికి యూనిఫాం అందే విధంగా చర్యలు తీసుకొని



విద్యకు ఎనలేని సేవ చేస్తున్నారని తెలిపారు.అనంతరం పాఠశాలలో హెల్త్ క్యాంపు, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం పాల్గొని విద్యార్థులకు చక్కటి సూచనలు అందించారు.అలాగే ఉత్తమ అవార్డు గ్రహీత పార్థసారధిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరిమి నవీన్, ఉప సర్పంచ్ పెదగాని రవి , పంచాయతీ సెక్రటరీ మనోజ్ ,వార్డు సభ్యులు పిచ్చయ్య, గండు శీను, రామ్మోహన్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శిరీష, యాకయ్య చంద్రశేఖర్, పార్థు, శ్రీదేవి ,శ్వేత, నరసయ్య, రేణుక ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 17:**
గిరిజనుల రిజర్వేషన్ 10 శాతం పెంచి నేటికి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని సబ్ స్టేషన్ తండాలో కేసీఆర్ చిత్రపటానికి మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు కవిత మాలోత్,మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలు ఆదివాసీల కోసం నెలకొల్పడం జరిగిందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కమటం శ్రీను, వీరు నాయక్,మేకల సురేష్, కొమ్ము రాహుల్,రావుల వినయ్ ,కేసముద్రం మున్సిపాలిటీ కౌన్సిలర్లు,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఫలితంగానే తెలంగాణకు విముక్తి

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 17:**
సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ముగింపు సందర్భంగా కేసముద్రం మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గోడిసెల వెంకన్న మాట్లాడుతూ...తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూమికోసం, భుక్తి కోసం ,పెట్టి చాకిరి విముక్తి కోసం దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని అన్నారు. భారతదేశ చరిత్రలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మరువలేనిదనీ,ఈ పోరాటంలో వేలాదిమంది మహిళలు ,చిత్రహింసల గురికాగా అనేకమంది ప్రాణాలు వదిలారన్నారు.దొడ్డి కొమరయ్య ,చిట్యాల ఐలమ్మ ,నల్ల నర్సింలు, టాను నాయక్ ,షేక్ బందగీ లాంటి ఎందరో వీరులు పోరాట ఫలితంగా పది లక్షల ఎకరాల భూమిని పంచడం జరిగిందనీ, ఈ పోరాటంలో 5,000 మంది ప్రాణత్యాగాలు చేశారన్నారు.వారి పోరాట ఫలితమే పదివేల గ్రామాలకు విముక్తి కలిగిందనీ, ఈ పోరాట ఫలితంగానే నిజాం ప్రభుత్వం తలవంచిది కానీ చరిత్రకు సంబంధం లేని వారు చరిత్రను వక్రీకరిస్తూ హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తూ రాజకీయ పబ్బం గడపడానికి




ప్రయత్నిస్తున్నారు.ఇది హిందూ ముస్లిం పోరాటం కాదని దొరల దోపిడీకి, నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటమన్నారు. ఈ పోరాట సజీవ సాక్షాలు తెలంగాణలో కనబడుతున్నాయనీ, నేడు పాలకులు రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబి స్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్ని ఐక్యం చేసి తెలంగాణ సాయుధ రహితంగా అమరవీరుల స్ఫూర్తిగా మరో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మోడెం వెంకన్న,బొబ్బల యాకూబ్ రెడ్డి,చాగంటి కిషన్ ,జాల జయరాజ్, శ్రీశైలం, నీరుటి జలంధర్ ,అల్పకొండ సావిత్రి, జానుపాటి జ్యోతి, జాటోతు వెంకన్న ,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.